రెండోరోజూ కిక్కిరిసిన జనం

అన్ని ప్రాంతాల్లో ప్రజాపాలనకు స్పందన

ఉప్పల్: కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజాపాలన కార్యక్రమానికి ఉప్పల్ సర్కిల్ పరిధిలో ఏర్పాటు చేసిన కేంద్రాల్లో దరఖాస్తు దారులు రెండవ రోజు కిక్కిరిసింది. కేంద్రాల వద్ద ఉదయం నుంచి లైన్‌లో నిల్చున్నారు. దీంతో పాటు రేషన్ కార్డుల దరఖాస్తులు సైతం ప్రజాపాలనలో స్వీకరిస్తున్న విషయాన్ని తెలుసుకున్న దరఖాస్తు దారులు ఇటూ సివిల్ సప్లయి కార్యాలయం, అటు కేంద్రాల వద్దకు పరుగులు పెట్టారు. దీంతో పాటు ఆధార్ కేంద్రాలు, జిరాక్స్ సెంటర్లు, మీ సేవ కేంద్రాల వద్ద ఎక్కడ చూసినా దరఖాస్తుదారులే కనిపించారు. రెండవ రోజు ఉప్పల్ సర్కిల్ పరిధిలోని నాలుగు డివిజన్లలో కలిపి 8,172 దరఖాస్తులు స్వీకరించినట్లు అధికారులు తెలిపారు. ఇప్పటి వరకు దాదాపు 12,251 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు.



ఉప్పల్ ఆధార్ కేంద్రం వద్ద ఉదయం చెప్పులను క్యూలో పెట్టిన దృశ్యం

కేంద్రాల వద్ద వసతులు కల్పించాలి..

ప్రజాపాలన కేంద్రాల వద్ద కనీస వసతులు లేకపోవడంతో వచ్చిన వారు అనేక ఇబ్బందులు పడుతున్నట్లు సీపీఎం ఉప్పల్ సర్కిల్ కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఉప్పల్ డీసీ శ్రీనివాస్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు.

ప్రజాపాలన దరఖాస్తుల గడువు పెంచాలి

ప్రజల వద్దకు పాలన పేరుతో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన దరఖాస్తుల గడువు పొడిగించాలని సీపీఐ మేడ్చల్ జిల్లా సహాయ కార్యదర్శి దామోదర్‌రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. దరఖాస్తులపై ప్రజలకు అవగాహన కల్పించి దరఖాస్తులు స్వీకరించే వార్డు కేంద్రాల వద్ద హెల్ప్‌డెస్క్‌లు ఏర్పాటు చేయాలన్నారు.

ప్రజాపాలన చరిత్రలో నిలిచిపోతుంది

కాప్రా: రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తున్న ప్రజాపాలన చరిత్రలో నిలిచిపోతుందని కాంగ్రెస్ పార్టీ ఉప్పల్ నియోజకవర్గం ఇన్‌చార్జి మందముల పరమేశ్వర్‌రెడ్డి అన్నారు. పరిపాలనలో సీఎం రేవంత్ సరికొత్త అధ్యాయనానికి నాంది పలికారన్నారు. ప్రజాపాలనలో భాగంగా వార్డు కార్యాలయాల ద్వారా ప్రజల నుంచి ప్రభుత్వం స్వీకరిస్తున్న దరఖాస్తులను శుక్రవారం కాప్రా డివిజన్‌లో ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాట ప్రకారం హామీలు నెరవేరుస్తూ ప్రజాపాలన అందిస్తోందన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ స్వర్ణరాజ్ శివమణి, కాంగ్రెస్ నాయకులు అంజిరెడ్డి, సుధాకర్, నాగేశ్వర్, పాకాల రాజు, అల్లూరయ్య, శ్రీధర్‌రెడ్డి, విఠల్, సాయికిరణ్‌యాదవ్, లింగం, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా పాలనతోనే బంగారు తెలంగాణ సాధ్యం

రామంతాపూర్: కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమం చరిత్రలో నిలిచిపోతుందని ప్రజాపాలన అభయహస్తం సంక్షేమ కార్యక్రమాలతోనే బంగారు తెలంగాణ సాధ్యమవుతుందని ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్‌చార్జి మందముల పరమేశ్వర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఓల్డ్ రామంతాపూర్ వార్డు కార్యాలయంలో కొనసాగుతున్న ప్రజాపాలన కార్యక్రమాన్ని ఉప్పల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్‌తో కలిసి ఆయన పరిశీలించారు. కాంగ్రెస్ నేతలు తవిడబోయిన గిరిబాబు, తౌఫిక్, రఫిక్, సుధాకర్, భాస్కర్, శ్రీకాంత్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న దరఖాస్తుల వెల్లువ

కాప్రా: ప్రజాపాలనలో భాగంగా సంక్షేమ పథకాల అమలు కోసం రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన దరఖాస్తుల స్వీకరణకు విశేష స్పందన కొనసాగుతోంది. కాప్రా సర్కిల్‌లోని ఆరు డివిజన్లకు సంబంధించి అభయహస్తం పేరుతో స్వీకరించే మొత్తం 20,902 దరఖాస్తులు వచ్చాయి. ఇతర దరఖాస్తులు 2,844 వచ్చినట్లు అధికారులు తెలిపారు. శుక్రవారం ఒక్కరోజే ఆరు డివిజన్లలో 12,314 అభయహస్తం దరఖాస్తులు ఇతర దరఖాస్తులు 1,905 వచ్చినట్లు అధికారులు వెల్లడించారు. శుక్రవారం ఒక్కరోజు కాప్రా డివిజన్‌లో అభయహస్తం దరఖాస్తులు 1,816, ఇతర దరఖాస్తులు 335, ఏఎస్‌రావునగర్ డివిజన్‌లో అభియాహస్తం 1,290, ఇతర దరఖాస్తులు 70, చర్లపల్లి డివిజన్‌లో అభయహస్తం 2,508, ఇతర దరఖాస్తులు 223, మీర్‌పేట్ హెచ్‌బీకాలనీ డివిజన్‌లో అభయహస్తం 2,227, ఇతర దరఖాస్తులు 476, నాచారం డివిజన్‌లో అభయహస్తం 2,078, ఇతర దరఖాస్తులు 335, మల్లాపూర్ డివిజన్‌లో అభయహస్తం 2,395, ఇతర దరఖాస్తులు 466 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు.

రెండో రోజు పోటెత్తిన జనం

బోడుప్పల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన ప్రజాపాలన కార్యక్రమంలో రెండు రోజు చెంగిచర్లలో జనాలు పోటెత్తారు. 1, 2, 3 డివిజన్ల పరిధిలోని గ్రామసభల్లో ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని దరఖాస్తులు అందజేశారు. కార్పొరేటర్ బింగి జంగయ్యయాదవ్, స్థానిక కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొత్త ప్రభాకర్‌గౌడ్, కుర్రి శివశంకర్ దరఖాస్తు దారులు ఇబ్బందులు పడకుండా సహాయ సహకారాలు అందించారు. దరఖాస్తు ఫారంలో ఉన్న సందేహాలను నివృత్తి చేయడంతో పాటు సలహాలు, సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో బండారు మల్లేష్‌యాదవ్, నాగ భూషణం, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

సంక్షేమమే లక్ష్యంగా..

మేడిపల్లి: పేదల అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా సీఎం రేవంత్‌రెడ్డి న్యాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీల అమలుకు ప్రజాపాలన కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని ఆ పార్టీ పీర్జాదిగూడ నాయకులు పన్నాల శ్రీనివాస్‌రెడ్డి, భూక్యా మణిరాంనాయక్ అన్నారు. పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పలు డివిజన్లలో ప్రజాపాలన కార్యక్రమంలో దరఖాస్తుల స్వీకరణను శుక్రవారం పరిశీలించారు. నాయకులు సుక్క జయందర్, కాటపాక కుమార్, బి.సునీల్, చెరుకు మహేష్‌గౌడ్, జయరాం నాయుడు, ఉదయ్‌కుమార్, నాల రాజు, ముత్యాలు, భరత్‌అంజమ్మ, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.



కాప్రాలో దరఖాస్తుదారులతో మాట్లాడుతున్న మందముల పరమేశ్వర్‌రెడ్డి



ఫారంను అందజేస్తున్న కాంగ్రెస్ పార్టీ నేతలు



పీర్జాదిగూడలో దరఖాస్తులను అందజేస్తున్న నాయకులు

కాపు భవన నిర్మాణానికి సహకరిస్తా



ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డిని అభినందిస్తున్న కాప్రా కులాల ఐక్యవేదిక ప్రతినిధులు

కుషాయిగూడ: కాపు భవన నిర్మాణానికి తన సంపూర్ణ సహకారం అందజేస్తానని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. కాప్రా కాపు కులాల ఐక్యవేదిక అధ్యక్షుడు రెడ్డి శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో శుక్రవారం ఎమ్మెల్యేను కలిశారు. ఈ సందర్భంగా ఆయనను ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. అనంతరం బీఎల్ఆర్ మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీని పూర్తి చేస్తానన్నారు. అలాగే కాపు కులాల అభ్యున్నతికి తోడ్పాటు అందిస్తానన్నారు. కాపు కులాల ఐక్యవేదిక ప్రతినిధులు జీవిఎస్ రావు, నానాజీ, ఎల్‌కే నాయుడు, పులి సత్యనారాయణ, కొల్లా రామారావు, ఉంగరాల రాయుడు, జయరాం ప్రసాద్, శేషు, కొండేటి బాలు, రవికుమార్, బాబు పాల్గొన్నారు.

ఎస్టీపీ ప్లాంట్‌ను అభివృద్ధి చేస్తాం



ప్లాంట్ డ్రాయింగ్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

మల్కాజిగిరి: సఫిల్‌గూడలోని ఎస్టీపీ ప్లాంట్‌ను అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ప్లాంట్‌ను ఆయన అధికారులతో కలిసి పరిశీలించారు. అక్కడ జరుగుతున్న పనులను ఆయన పరిశీలించారు. సీజీఎం సుజాత, జీఎం సునీల్‌ను పనుల గురించి ఆరా తీశారు. సుమారు రూ.12.84 కోట్లతో చేపట్టే పనుల్లో 80 శాతం పూర్తయ్యాయని ఎమ్మెల్యేకు వివరించారు. మిగతా పనులు త్వరితగతిన జరిగేలా చూడాలని వారిని ఆదేశించారు. డీజీఎం నరహరి, మేనేజర్ వేణుగోపాల్, మాజీ కార్పొరేటర్ జగదీష్‌గౌడ్ పాల్గొన్నారు.

చేయూత

మల్కాజిగిరి: అనారోగ్యంతో బాధపడుతున్న పీవీఎన్ కాలనీకి చెందిన సాయిబాబాశర్మ అనే వ్యక్తికి మల్కాజిగిరి కార్పొరేటర్ శ్రవణ్ రూ.5 వేలు అందజేసి చేయూత అందించారు. ఆయనకు ఆరోగ్యశ్రీ ద్వారా చికిత్స చేయించడానికి తగిన ఏర్పాట్లు చేస్తామన్నారు.

కాంగ్రెస్ పార్టీ బలోపేతమే లక్ష్యం



నూతన కమిటీ సభ్యులకు నియామక ఉత్తర్వులను అందజేస్తున్న అరుణ్‌పటేల్

మల్లాపూర్: ఉప్పల్ నియోజకవర్గంలోని అన్ని డివిజన్లలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడమే లక్ష్యంగా నూతన కమిటీలను ఏర్పాటు చేస్తున్నామని ఉప్పల్ నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు అరుణ్ పటేల్ అన్నారు. ప్రధాన కార్యదర్శి కప్పర సాయిగౌడ్, కిరణ్ ఆధ్వర్యంలో డివిజన్ యూత్ నూతన కమిటీని శుక్రవారం నియమించారు. మల్లాపూర్ యూత్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ రాజీవ్‌వర్మ, ఉపాధ్యక్షులుగా వినేష్ యాదవ్, సాయి మైథిలి, ప్రధాన కార్యదర్శిగా ప్రణీత్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శిగా మధుసూదన్‌లకు నియామకపు ఉత్తర్వులను అందజేశారు. యూత్ ప్రధాన కార్యదర్శి కిషోర్, అధ్యక్షులు సంపత్‌గౌడ్, జయంత్‌గౌడ్, గణేష్ గౌడ్, సత్యం పాల్గొన్నారు.

ఏఈ దివ్యజ్యోతికి సన్మానం



గౌతంనగర్: ప్రజా సమస్యల పరిష్కారంలో మక్కువ చూపుతున్న గౌతంనగర్ డివిజన్ ఏఈ దివ్యజ్యోతికి హనుమాన్‌పేట్‌లో వెస్ట్ మల్కాజిగిరి సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ అసోషియేషన్ ప్రతినిధులు శుక్రవారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఏవీ స్వామి, హజ్ర సయ్యద్, మనోజ్ తదితరులు ఉన్నారు.

విజన్ కళాశాల విద్యార్థికి కబడ్డీ నేషనల్ టీంలో చోటు



నందిని అభినందిస్తున్న విజన్ కళాశాల యాజమాన్యం

మేడిపల్లి: జాతీయస్థాయి బాలికల కబడ్డీ జట్టులో పీర్జాదిగూడ విజన్ కళాశాల విద్యార్థిని నందిని చోటు దక్కించుకుంది. పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని విజన్ కళాశాలలో ఇంటర్(ఎంపీసీ) ద్వితీయ సంవత్సరం చదువుతున్న వెంకటాపూర్‌కు చెందిన అందె నందిని అండర్-17 బాలికల జాతీయ జట్టుకు ఎంపిక కావడంపై ఆ విద్యాసంస్థ కరస్పాండెంట్ భావన, డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి డిగ్రీ, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ దానయ్య, రమాకాంత్, పీఇటి మెట్టు మహేష్ యాదవ్‌తో పాటు పలువురు అధ్యాపకులు ఆమెను అభినందించారు.

విద్యార్థులు అన్నిరంగాల్లో రాణించాలి



బహుమతులు అందజేస్తున్న నరేందర్‌రెడ్డి

అల్వాల్: విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని అల్ఫోర్స్ విద్యా సంస్థల చైర్మన్ వి.నరేందర్‌రెడ్డి అన్నారు. అల్వాల్ సుచిత్రలోని అల్ఫోర్స్ జూనియర్ కళాశాలలో ఈ నెల 17న నిర్వహించిన గణిత ఒలింపియాడ్ పరీక్షల్లో స్థానికంగా ఉన్న సుమారు 15 పాఠశాలలకు చెందిన 6 నుంచి 10వ తరగతి వరకు సుమారు 400 మంది విద్యార్థులు పరీక్షల్లో పాల్గొన్నారు. పరీక్షల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు శుక్రవారం నిర్వహించిన బహుమతుల ప్రదానోత్సవంలో నరేందర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై బహుమతులు, సర్టిఫికెట్లను అందజేశారు.

విద్యార్థుల్లోని ప్రతిభను వెలికి తీయాలి

ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



టాలెంట్ ప్రదర్శనలు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

రామంతాపూర్: శాంతినగర్‌లోని చైతన్య భారతి స్కూల్‌లో శుక్రవారం ప్లేస్కూల్ విద్యార్థులు తయారు చేసిన వైజ్ఞానిక నమూనాల టాలెంట్ షో ప్రదర్శనలు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులు తయారు చేసిన నమూనాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లోనూ ప్రతిభ దాగి ఉంటుందని, దాన్ని వెలికి తీయాల్సిన బాధ్యత ఉపాధ్యాయులు, తల్లిదండ్రులదే అన్నారు. తమ బీఎల్ఆర్ ట్రస్ట్ ద్వారా ప్రతిభ కలిగిన పేద విద్యార్థులను ఆదుకుంటామన్నారు. ప్రదర్శనలో విద్యార్థులు తయారు చేసిన నమూనాలు ఆకట్టుకున్నాయి. విజ్ఞాన భారత ఫౌండర్ తాటి రమేష్, కరస్పాండెంట్ రామ నర్సయ్య, ప్రధానోపాధ్యాయురాలు లలిత, బీఆర్ఎస్ నేతలు సర్వబాబు యాదవ్, గంధం నాగేశ్వర్‌రావు, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

పేదలు వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలి



బస్తీ దవాఖానాను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

అల్వాల్: బస్తీ దవాఖానాల్లో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం వెంకటాపురం డివిజన్ పరిధిలోని ఇంద్రనగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన బస్తీ దవాఖానాను ఆయన స్థానిక కార్పొరేటర్ సబితకిషోర్‌తో కలిసి ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ బస్తీ దవాఖానాలతో వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ ఆనంద్, డాక్టర్ ప్రసన్న, మోసీస్, అనంత్, దేవయ్యగౌడ్, మురళిగౌడ్, రాజు, సురేష్, పోచయ్య పాల్గొన్నారు.

3 నుంచి జాతీయ జూనియర్ బ్యాడ్మింటన్ పోటీలు



జాతీయ జూనియర్ బ్యాడ్మింటన్ పోటీల బ్రోచర్ ఆవిష్కరిస్తున్న వికాస్

మల్లాపూర్: 3 నుంచి 9 తేదీ వరకు జాతీయ జూనియర్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ పోటీలను నిర్వహిస్తున్నట్లు ఎంకేఎస్, హెచ్‌ఎం చీఫ్ కోచ్ ఫౌండర్ పి.వికాస్ తెలిపారు. శుక్రవారం నాచారం ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో జాతీయ జూనియర్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూపొందించిన టోర్నమెంట్ బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వికాస్ మాట్లాడుతూ సికింద్రాబాద్‌లోని రైల్వే ఆర్ఆర్సీ ఇండోర్ స్టేడియంలో పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అండర్-19 బాలబాలికలు ఈ టోర్నమెంట్‌లో పాల్గొంటారని తెలిపారు. టోర్నీలో గెలిచిన వారూ అంతర్జాతీయ స్థాయిలో జరిగే పోటీలకు ఎంపిక చేస్తారని పేర్కొన్నారు. బ్రోచర్ ఆవిష్కరణలో ఆర్గనైజింగ్ సెక్రటరీ హర్ష, మియాపూర్ డీపీఎస్ హెచ్ఓడీ జీవన్‌కుమార్, మ్యాచ్ కంట్రోలర్ పీవీఎల్ కుమార్, అసిస్టెంట్ అడిట్ ఆఫీసర్ వి.సీతాల్ మోహన్‌దాస్ పాల్గొన్నారు.

ఘనంగా భవన్స్ కళాశాల వార్షికోత్సవం



అల్వాల్: సైనిక్‌పురి భవన్స్ వివేకానంద కళాశాల వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. శుక్రవారం కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థులు పలు సాంస్కృతిక ప్రదర్శనలు చేశారు. అనంతరం ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు కళాశాల నిర్వాహకులు బహుమతులు అందజేశారు.

అథ్లెట్లకు క్రీడా దుస్తుల పంపిణీ



జిల్లా మాస్టర్ అథ్లెట్‌లకు క్రీడా దుస్తులను అందజేస్తున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

అల్వాల్: 30, 31 తేదీల్లో గచ్చిబౌలిలో నిర్వహించనున్న 10వ మాస్టర్ అథ్లెటిక్ స్టేట్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొనే మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా మాస్టర్ అథ్లెట్లకు క్రీడాదుస్తులను మేడ్చల్-మల్కాజిగిరి మాస్టర్ అథ్లెట్ అసోషియేషన్ అధ్యక్షులు మర్రి రాజశేఖర్‌రెడ్డితో కలిసి శుక్రవారం బోయిన్‌పల్లి ఉన్న క్యాంపు కార్యాలయంలో మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డితో కలిసి పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా అథ్లెట్ అసోసియేషన్ ముఖ్య సలహాదారులు అంజిరెడ్డి, పాట్రన్‌లు రాజేందర్, చిరంజీవిరెడ్డి, సి.మల్లారెడ్డి, సెక్రటరీలు డాక్టర్ రత్నకుమార్, ట్రెజరర్ శ్రీలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

మెట్రో కాంట్రాక్టు ఉద్యోగి ఆత్మహత్య

ఉప్పల్: కుటుంబ కలహాలతో మెట్రో ఉద్యోగి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. యాదాద్రి జిల్లా పెద్ద కందుకూరు ప్రాంతానికి చెందిన ముప్పిడి శంకరయ్య కుమారుడు నరేష్(28) వృత్తిరీత్యా నాగోల్ మెట్రో స్టేషన్‌లో సిగ్నలింగ్ విభాగంలో ఉద్యోగి. ఉప్పల్ సరస్వతినగర్‌లో నివాసం ఉంటున్నాడు. భార్య శ్రీమంతానికి పుట్టింటికి వెళ్లింది. కాగా ఊర్లో పొలం విషయమై అన్నదమ్ములు, భార్యకు వివాదం ముదిరింది. దీంతో మనస్తాపానికి గురైన నరేష్ ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్త గాంధీ ఆస్పత్రికి తరలించారు. తండ్రి శంకరయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వైభవంగా పూజలు



అల్వాల్: నేరేడ్‌మెట్ ఈస్ట్ కాకతీయనగర్‌లో విజయ గణపతి రేణుకా ఎల్లమ్మ ఆలయంలో మూడు రోజుల పాటు జరుగుతున్న ఉత్సవాలు ముగిశాయి. అమ్మ వారి కళ్యాణం వైభవంగా జరిగింది. పలు ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

వైభవంగా అయ్యప్ప పడిపూజ



గౌతంనగర్: హనుమాన్‌పేట్‌లో కన్య స్వామి ఆదిత్యరెడ్డి నివాసంలో శ్రీనివాస గురుస్వామి ఆధ్వర్యంలో అయ్యప్ప పడిపూజ వైభవంగా నిర్వహించారు. గౌతంనగర్‌కు చెందిన వై.శ్రీనివాసరావు, శ్రవణ్‌కుమార్ భజన బృందం ఆలపించిన అయ్యప్ప భక్తి గీతాలు ఆకట్టుకున్నాయి.

నేడు ఉప్పల్‌లోని ఐ ఫోకస్ 18వ వార్షికోత్సవం

ఉప్పల్: ఉప్పల్‌లోని ఐ ఫోకస్ మిషన్ సామాజిక సాంస్కృతిక నైపుణ్య సంస్థ 18వ వార్షికోత్సవం శనివారం సాయంత్రం ఉప్పల్ బగాయత్‌లోని తన కార్యాలయంలో జరుపుకుంటున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమానికి పలువురు రాష్ట్ర మంత్రులు, మాజీ మంత్రులు హాజరవుతున్నట్లు ప్రకటించారు.

పీఎం విశ్వకర్మ యోజనను సద్వినియోగం చేసుకోవాలి



నాచారంలో పీఎం విశ్వకర్మ యోజన ఎన్‌రోల్‌మెంట్ కోసం వచ్చిన చేతివృత్తిదారులు

మల్లాపూర్: చేతివృత్తుల వారు ఆర్థిక ప్రయోజనం పొందేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి విశ్వకర్మ యోజనను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని నాచారం డివిజన్ బీజేపీ అధ్యక్షులు మల్కా ప్రకాష్ అన్నారు. శుక్రవారం నాచారంలో లబ్ధిదారులకు పథకంలో ఎన్‌రోల్‌మెంట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మల్కా ప్రకాష్ మాట్లాడుతూ విశ్వకర్మ యోజన పథకాన్ని సద్వినియోగం చేసుకునేందుకు మొదటి రోజు స్పందన ఉందన్నారు. బీజేపీ ఉప్పల్ మహిళా కన్వీనర్ అనితారెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు రవికాంత్, డివిజన్ ప్రధాన కార్యదర్శి నవీన్‌కుమార్, యువ మోర్చా అధ్యక్షులు అభిషేక్ గౌడ్, వరలక్ష్మీ, బాలు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను వేగంగా పూర్తిచేయాలి



కృష్ణానగర్‌లో అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ సునీతశేఖర్ యాదవ్

మౌలాలి: మౌలాలి డివిజన్ పరిధిలోని అన్ని కాలనీల్లో పెండింగ్ ఉన్న అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తిచేయాలని అధికారులకు స్థానిక కార్పొరేటర్ గున్నాల సునీత రాముయాదవ్ సూచించారు. శుక్రవారం డివిజన్ పరిధిలోని కృష్ణానగర్ కాలనీలో రూ.30 లక్షలతో మంజూరైన అభివృద్ధి పనులను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ గతంలో కృష్ణానగర్‌లో రోడ్లు, డ్రైనేజీ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని సర్కిల్ అధికారులతోపాటు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామన్నారు. అధికారులు నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. ఆ నిధులతో కృష్ణానగర్‌లో శుక్రవారం రోడ్ల నిర్మాణ పనులను ప్రారంభించామన్నారు. కార్యక్రమంలో నాగరాజు, సైఫ్, ఏఈ మధురిమ, వర్క్స్ ఇన్‌స్పెక్టర్ మహేందర్, రమణ, వెంకటేష్, శివ తదితరులు పాల్గొన్నారు.